సాగు లెక్క.. ఇక పక్కా

- సర్వే నంబర్ల వారీగా పంటల నమోదు
- క్షేత్రస్థాయిలో ఏఈఓల పర్యటన
- యాప్‌లో పంటల వివరాలు
- తగ్గిన పంటల ప్రోత్సాహకం

సీజన్ల వారీగా వ్యవసాయ శాఖ పంటల నమోదు ప్రక్రియ (క్రాప్ బుకింగ్) చేపట్టింది. ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలో పంటల సర్వే మొదలైంది. వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి క్లస్టర్ల వారీగా సాగు చేసిన పంటల వివరాలను పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. పంటల నమోదుతో రైతులకు మేలు జరుగుతుందని, వ్యవసాయ అధికారులకు సహకరించాలని కోరుతున్నారు.


జనగామలో పంటల వివరాలను నమోదు చేస్తున్న ఏఈఓ శ్రీలత

అక్కన్నపేట(హుస్నాబాద్): పక్కాగా పంటల వివరాల లెక్కలు తీసేందుకు అక్కన్నపేట మండలంలోని వ్యవసాయ శాఖ అధికారులు పల్లెబాట పట్టారు. అక్కన్నపేట, అంతక్కపేట, జనగామ, మల్లంపల్లి, రామవరం, పోతారం(జే) గ్రామాల ఏఈఓలు గత కొద్ది రోజులుగా ఇదే పనిలో ఉన్నారు. రైతుల వారీగా సర్వే నంబర్లు, సాగు విస్తీర్ణం, ప్రధాన పంటలు, అంతర పంటలు, నీటి వసతి వివరాలతో పాటు యజమాని సెల్ నంబర్, సంతకాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. పంట ఏ దశలో ఉంది? చీడ పీడలు ఏమైనా ఆశించాయా? పంట దిగుబడి ఎంత వచ్చే అవకాశం ఉంది? తదితర వివరాలను వివిధ దశల్లో నమోదు చేసేలా యాప్‌ను రూపొందించారు. ఎక్కడో కూర్చుని వివరాలు నమోదు చేయకుండా, తప్పనిసరిగా పొలాల వద్దకు వెళ్లి నమోదు చేసేలా ఏర్పాటు చేశారు. ఈ సర్వేతో అవసరమయ్యే ఎరువులు, విత్తనాలను సమకూర్చడంతో పాటు పంట కొనుగోళ్ల సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకునే అవకాశం కలుగుతుంది.

22 వేల ఎకరాల్లో పంటల సాగు

ఈసారి వానాకాలంలో సుమారుగా 22 వేల ఎకరాల్లో పంటలను సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో అత్యధికంగా 15,145 ఎకరాల్లో వరి, 520 ఎకరాల్లో పత్తి సాగు చేసే అవకాశం ఉంది. అయితే ఇప్పటి వరకు పత్తి 520 ఎకరాల్లో సాగు చేయగా, మొక్కజొన్న 310 ఎకరాల్లో వేశారు. 210 ఎకరాల్లో నారుమడిని సిద్ధం చేసి ఉంచారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పంటల వివరాలను నమోదు చేస్తున్నారు.

పంట లెక్కతో రైతులకు మేలు



క్షేత్రస్థాయిలో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను లెక్కించడం ప్రారంభించాం. రైతుల సమక్షంలో వారు సాగు చేస్తున్న పంటల వివరాలు, సాగు విస్తీర్ణం తదితర విషయాలను యాప్‌లో నమోదు చేస్తున్నాం. రైతులు అధికారులకు సహకరించి సాగు చేసే పంటల వివరాలను నమోదు చేయించుకోవాలి. వీటి ద్వారా ధాన్యం అమ్ముకునే సమయంలో, అకాల వర్షాలతో పంటలు నష్టపోతే నష్టపరిహారం విడుదల సమయంలో రైతులకు మేలు జరుగుతుంది.

– శ్రీలత, వ్యవసాయ విస్తరణాధికారి, జనగామ క్లస్టర్


మొక్క నాటుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ రజిత

మొక్కలు నాటి సంరక్షించాలి

మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత

హుస్నాబాద్: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలను నాటి వాటిని సంరక్షించుకోవడం అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని 10వ వార్డు జీఆర్ రెడ్డి కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించుకోవాలన్నారు. పట్టణంలోని ప్రతీ వార్డులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోవిందు రవి, కో ఆప్షన్ సభ్యులు అయిలేని శంకర్ రెడ్డి, అయాబ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, వన మహోత్సవ సూపర్‌వైజర్ శంకర్, పర్యావరణ ఇంజనీర్ రవికుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలం మంగోల్ గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని ఎన్ఆర్ఈజీఎస్ ప్రత్యేక అధికారి రమేష్‌కు పీఏసీఎస్ డైరెక్టరు నర్సింహాచారి ఫిర్యాదు చేశారు. సోషల్ ఆడిట్‌లో భాగంగా సోమవారం గ్రామసభ నిర్వహించారు. 2023–24లో గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో పల్లె ప్రకృతి వనం నిర్వహణకు రూ.4,53,600 గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేసినట్లు రికార్డు ఉందన్నారు. వీటిపై విచారణ చేపట్టాలన్నారు. ఈజీఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శిని అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదని ఆరోపించారు. విచారణ చేపట్టి బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకొని నగదు రికవరీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరేశం, సుదర్శన్‌చారి, ఆంజనేయులు, రమేష్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

Assessment No.712, H.No.8-17 ...

Sd/- Y. CHANDRA RUSHI B.Sc., L.L.B
Advocate & Notary, # 1-2-275, Opp: Court, Brundavan Colony, JANGAON Town & Dist. Cell: 9848430926.

క్లుప్తంగా

దుబ్బాక కోర్టు ఏజీపీగా నాగరాజు



దుబ్బాక: దుబ్బాక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా సీహెచ్ నాగరాజు నియమితులయ్యారు. సోమవారం ఈ మేరకు సిద్దిపేట కలెక్టర్ మను చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదవీ కాలం ఆరు నెలలు ఉంటుందని ఉత్తర్వులో పేర్కొన్నారు.

'గడిమైసమ్మ'కు బోనాలు


బోనాలతో గడిమైసమ్మ ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

తొగుట(దుబ్బాక): మండలంలోని వెంకట్రావుపేట ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గడిమైసమ్మ అమ్మవారి ఉత్సవం సోమవారం నిర్వహించారు. డప్పుచప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలతో బోనాలతో గ్రామస్తులు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించి పూజలు నిర్వహించారు. వానలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు.

నాచగిరికి రూ.1.75 లక్షల ఆదాయం


వేలం పాట నిర్వహిస్తున్న ఈఓ అన్నపూర్ణ

వర్గల్(గజ్వేల్): నాచగిరి క్షేత్రంలో ఒడి బియ్యం సేకరణకు బహిరంగ వేలం నిర్వహించారు. హైదరాబాద్ వాసి రూ.1.75 లక్షలకు దక్కించుకోగా, తక్కువ ధరకు పూలదండలు సరఫరా, ముఖ్యమైన రోజులలో పూల అలంకరణ చేసే హక్కును గజ్వేల్ వాసి దక్కించుకున్నారని ఆలయ ఈఓ అన్నపూర్ణ తెలిపారు. ధరావత్‌దారులు పాల్గొనకపోవడంతో కొబ్బరికాయలు, పూజా సామగ్రి వేలం రద్దు చేశామన్నారు.

ఉపాధ్యాయుడిని కేటాయించండి


ఎంఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఉపాధ్యాయులను కేటాయించాలని కోరుతూ మండలంలోని బిజి వెంకటాపూర్ గ్రామస్తులు సోమవారం మండల వనరుల కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ఎంఈఓ లేకపోవడంతో కార్యాలయ సిబ్బంది గోవర్ధన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ కిరణ్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో 32 మంది విద్యార్థులు ఉన్నారని, నాలుగేళ్లుగా ఒకే ఉపాధ్యాయుడితో పాఠశాల కొనసాగుతోందన్నారు. ఏకోపాధ్యాయుడితో విద్యార్థులకు సరైన విద్య అందడం లేదని, వెంటనే మరో ఉపాధ్యాయుడిని కేటాయించాలని కోరారు. ఫోన్ ద్వారా ఎంఈఓ ఉదయ్‌భాస్కర్ రెడ్డికి సమాచారం తెలుపగా రెండు రోజుల్లో ఉపాధ్యాయుడిని కేటాయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

మెకానిక్‌ల కుటుంబాలకు చేయూత


ఆర్థిక సహాయం అందజేస్తున్న మెకానిక్ అసోసియేషన్ సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రోడ్డు ప్రమాదాల్లో మరణించిన టూ వీలర్ మెకానిక్‌ల కుటుంబాలకు సిద్దిపేట జిల్లా టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ సభ్యులు చేయూత అందించారు. సోమవారం సిద్దిపేట జిల్లా టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో మరణించిన నలుగురు మెకానిక్‌ల ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున నగదు అందజేశారు. మర్కుక్ మండలంలోని నవీన్, దౌల్తాబాద్ మండలంలోని వేణు, గజ్వేల్ మండలంలోని స్వామి, కోహెడ మండలంలోని ప్రశాంత్ రోడ్డు ప్రమాదంలో మరణించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు తడిసిన వెంకట్‌రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చందు, కోశాధికారి నర్సింహాచారి, సుధాకర్‌రెడ్డి, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం ప్రాధాన్యంపై అవగాహన


అక్కారంలో పిల్లల ఎత్తు కొలతను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి


బెజ్జంకిలో చిన్నారి ఎత్తు, బరువును పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది, అంగనవాడీ టీచర్లు

గజ్వేల్: మండలంలోని అక్కారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గ్రోత్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల ఎత్తు కొలత, బరువును పరిశీలించారు. పోషకాహారం ప్రాధాన్యతను తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, అంగన్‌వాడీ టీచర్లు మంజుల, స్వప్న, ఆశా వర్కర్లు నాగమణి, కవిత, గ్రామైఖ్య సంఘం లీడర్ రఫియా తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకిలో..

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి గ్రామ పంచాయతీలో అంగన్‌వాడీలు సోమవారం గ్రోత్ మేళా నిర్వహించారు. 0 నుంచి 5 సంవత్సరాల చిన్నారులను ఎత్తు, బరువు పరిశీలించారు. వయస్సుకు తగ్గ బరువు, ఎత్తులేని వారిని గుర్తించి పౌష్టికాహారాన్ని అందజేయనున్నారు. కార్యక్రమంలో బెజ్జంకి వైద్యశాల సూపర్‌వైజర్ సులోచన, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మా కుల వృత్తిని కాపాడాలి


వినతి పత్రం ఇస్తున్న వడ్డెర సంఘం నాయకులు

సిద్దిపేటరూరల్: మల్లన్నసాగర్ ముంపునకు గురైన తమను ఆదుకోవాలని కోరుతూ సోమవారం తొగుట గ్రామ వడ్డెర కులస్తులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. అంతకు ముందు కలెక్టరేట్ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వడ్డెర సంఘం నాయకులు మాట్లాడారు. బండలు కొట్టి తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని, మల్లన్నసాగర్ ప్రాజెక్టుతో సర్వస్వం కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. వంద కుటుంబాలకు పైగా ఉన్న తమకు దగ్గరలో ఉన్న రాంపూర్, చందాపూర్ గ్రామాలకు చెందిన బండలు కొట్టుకొని అమ్ముకునే హక్కు కల్పించాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శేఖర్, పట్టణ అధ్యక్షుడు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తిని అడ్డుకునే వారిపై చర్యలు తీసుకోండి

ఏసీపీకి తిమ్మాపూర్ గ్రామ మాదిగ కులస్తుల వినతి


మాట్లాడుతున్న తిమ్మాపూర్ మాదిగ కుల పెద్దలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): అట్రాసిటీ కేసును దృష్టిలో పెట్టుకుని తిమ్మాపూర్ గ్రామస్తులు డప్పు కళాకారులను ఏ కార్యక్రమానికి పిలవడం లేదని తిమ్మాపూర్ గ్రామ మాదిగ కులస్తులు వాపోయారు. ఈ మేరకు సోమవారం గజ్వేల్ ఏసీపీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. గతంలో తమ పట్ల వివక్ష చూపడంతో కొంతమందిపై అట్రాసిటీ కేసు నమోదైందన్నారు. అప్పటి నుంచి గ్రామంలో ఏ కార్యక్రమం జరిగినా డప్పు వాయించేందుకు తమను పిలవడం లేదని, పిలిస్తే జరిమానా విధిస్తామని హుకుం జారీ చేశారని తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. వీరికి ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మైస రాములు మద్దతు తెలిపారు.

ఉపాధ్యాయుడికి ఘనంగా వీడ్కోలు


ప్రశాంత్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

వర్గల్(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్ది అందరి మన్ననలు చూరగొన్న వర్గల్ మండలం శాకారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వరాల ప్రశాంత్‌కు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. 70 రక్తదానాలు చేసి ఎందరికో స్ఫూర్తి నింపిన ప్రశాంత్, విద్యాబోధనలో మేటిగా రాష్ట్రస్థాయి పురస్కారం దక్కించుకోగా, రాష్ట్రస్థాయి మ్యాగజైన్‌లో పాఠశాల కథనానికి చోటుదక్కింది. ఉపాధ్యాయుడు బదిలీ కావడంతో విద్యార్థులు కన్నీటిపర్యంతమయ్యారు.

పాముకాటుతో గేదె మృతి

చేర్యాల(సిద్దిపేట): పాము కాటుతో సూడి గేదె మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని ఆకునూరులో ఆదివారం రాత్రి జరిగింది. పోలోజు శ్రీనివాస్ తన గేదెలను మేతమేపిన తర్వాత వ్యవసాయ బావి వద్ద కట్టేసి వచ్చాడు. సోమవారం ఉదయం చూడగా పాము కాటుతో మృతి చెంది కనిపించింది.

రైతులను నమ్మించి కాంగ్రెస్ మోసం

కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి


వినతి పత్రం ఇస్తున్న కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి


గజ్వేల్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

దుబ్బాక: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా రైతులను మోసం చేస్తోందని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్తు తిరుమల్‌రెడ్డి అన్నారు. సోమవారం కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో దుబ్బాకలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులకిచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ వెంకట్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడచినా హామీలు అమలు చేయకుండా జాప్యం చేస్తోందన్నారు. రైతులకిచ్చిన హామీలను అమలు చేయాలని, లేకుంటే కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతు రుణమాఫీ చేయాలని కోరుతూ సోమవారం బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కృష్ణమోహన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆంక్షలు లేకుండా రుణమాఫీ ఏకకాలంలో చేయాలన్నారు.

కొమురవెల్లిలో..

కొమురవెల్లి(సిద్దిపేట): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు బుర్గోజు నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యకర్తలతో కలసి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్‌రూరల్: అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మాయమాటలతో అన్నదాతలను మోసం చేస్తోందని బీజేపీ కిసాన్‌మోర్చా నాయకులు ఆరోపించారు. సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా రైతులను మభ్యపెడుతుందని విమర్శించారు.

వైఎస్‌కు ఘన నివాళి

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రవేశ పెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు ఇప్పటి ప్రభుత్వాలకు మార్గదర్శకంగా నిలిచాయని వైఎస్ అభిమానులు, నాయకులు కొనియాడారు. సోమవారం వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి సందర్భంగా వాడవాడలా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైఎస్ తన పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఆయన ఆశయ సాధనకు నాయకులు కృషిచేయాలన్నారు.


సిద్దిపేటలో నివాళులర్పిస్తున్న నాయకులు


ప్రజ్ఞాపూర్‌లో..


హుస్నాబాద్‌లో..


దుబ్బాకలో ..

సంక్షిప్త వార్తలు

◆ నిధులు కేటాయించాలి

హుస్నాబాద్: త్వరలో ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో హుస్నాబాద్ రైల్వేలైన్ కోసం నిధులు కేటాయించాలని కేంద్రం మంత్రి బండి సంజయ్‌ని సోమవారం భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణు గోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశాడు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన సభలో హుస్నాబాద్ రైల్వేలైన్ కోసం కృషి చేస్తానని బండి సంజయ్ చెప్పారని గుర్తు చేశాడు. జనగామ నుంచి హుస్నాబాద్ మీదుగా కరీంనగర్ వరకు రైల్వే లైన్ కోసం ప్రతిపాదనలు పంపించాలని కోరాడు.

◆ పంటలపై అవగాహన

నంగునూరు(సిద్దిపేట): వానాకాలం సాగుకు అనుకూలమైన స్వల్ప కాలిక వరి సాగుపై మంగళవారం పాలమాకుల రైతు వేదికలో దృశ్య శ్రవణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఏఈఓ అశోక్ తెలిపారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా ఉదయం 10 గంటలకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ మాధవి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంటల సాగుపై అవగాహన కల్పిస్తారన్నారు. మండలంలోని రైతులు కార్యక్రమానికి హాజరు కావాలన్నారు.

◆ మాజీ మావోయిస్టు నేతను విడుదల చేయాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన మాజీ మావోయిస్టు నేత హుస్సేన్‌ను తెల్లవారుజామున పోలీసులు దౌర్జన్యంగా అరెస్టు చేశారని, వెంటనే ఆయనను విడుదల చేయాలని భారత ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి సంతోష్‌నాయక్ సోమవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హుస్సేన్ అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పొరపాట్లే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని, వెంటనే హుస్సేన్‌ను కోర్టులో హాజరుపర్చాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

◆ ఉపాధ్యాయుడి మృతి



ములుగు(గజ్వేల్): ములుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎల్.సత్యనారాయణ(59) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన మృతికి హెచ్ఎం ఉదయభాస్కర్ రెడ్డి, అమర్‌నాథ్‌రావు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. ఆయన మృతికి సంతాపంగా పాఠశాలకు సెలవు ప్రకటించారు.

◆ బీఆర్ఎస్‌కు రాజీనామా

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ రాష్ట్ర నేత బట్టు దయానంద్‌రెడ్డి సోమవారం ఆ పార్టీకి రాజీనామా చేశాడు. తన రాజీనామా పత్రాన్ని గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డికి అందజేశాడు. ఐదేళ్లుగా పార్టీలో సముచితస్థానం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. 200 మంది రైతులకు సంబంధించి రీ షెడ్యూల్ రుణాల విషయాన్ని కేసీఆర్ దృష్టికి తీసుకపోయినా ఫలితం లేకుండాపోయిందన్నాడు.

◆ నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): నూతన చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునే సమయంలో చెడు అలవాట్లకు బనిస కావొద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రమోహన్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ నకిలీ విత్తనాలతో నష్టం

జగదేవ్‌పూర్(గజ్వేల్): వరి విత్తనాలు నానబెట్టి వారం దాటినా మొలకెత్తలేదని, నకిలీ విత్తనాలతో తమను నట్టేట ముంచారంటూ మండలంలోని తిగుల్ గ్రామ రైతు చంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వానాకాలంలో వరి సాగు చేయడానికి ఈనెల 2వ తేదీన జగదేవ్‌పూర్‌లో హనుమాన్ ఫర్టిలైజర్ దుకాణంలో అంకూర్‌శ్రీ రకం వరి విత్తనాలు మూడు సంచులు రూ.3600లకు కొనుగోలు చేశాడు. విత్తనాలు నానబెట్టి వారం గడిచినా మొలకరాలేదు. నకిలీ విత్తనాలతో మోసపోయినట్లు వాపోయాడు. ఈ విషయాన్ని డీలర్‌కు తెలపడంతో కంపెనీ ప్రతినిధి వచ్చి చూసి వెళ్లాడు. అలాగే మండల వ్యవసాయ అధికారి దృష్టికి తీసుకపోయినట్లు తెలిపారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధిత రైతు కోరాడు.

◆ 1 నుంచి నూతన చట్టాల అమలు

కొమురవెల్లి(సిద్దిపేట): మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని చేర్యాల సీఐ శ్రీను అన్నారు.సోమవారం మండల కేంద్రంలో కేజీబీవీలో మహిళల రక్షణ, చట్టాలు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, షీటీమ్స్, నూతన చట్టాల గురించి అవగహన కల్పించారు. దేశంలో జూలై 1 నుంచి నూతన చట్టాలు అమలవుతున్నాయని, వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నీరజ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రజాప్రతినిధులకు సన్మానం

కోహెడరూరల్(హుస్నబాద్): మండలంలోని శనిగరంలో సోమవారం మాజీ ఎంపీపీ నాగరాజు శ్యామల, ఎంపీటీసీ కవ్వంపల్లి స్వప్న శశిధర్ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి చంద్రం, మాజీ సర్పంచ్ కర్ర జయశ్రీ, గాదె శ్రీధర్, డీఈ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు సన్మానం

సిద్దిపేటరూరల్: మండలంలో ట్రిపుల్‌ఐటీ సీట్లు సాధించిన విద్యార్థులు మరింత పురోగతి సాధించాలని నారాయణరావుపేట మండల బీఆర్ఎస్ నాయకులు అన్నారు. సోమవారం ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన జక్కాపూర్ గ్రామ విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ట్రిపుల్ ఐటీ సీట్ల సాధనలో సిద్దిపేట నియోజకవర్గం రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లం, మాజీ ఎంపీపీ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

◆ తీరిన మురుగు దుర్గంధం ఇక్కట్లు

చేర్యాల(సిద్దిపేట): విస్తరణతో ఇక్కట్లు వార్తకు అధికారులు స్పందించారు. పట్టణ కేంద్రంలోని బాలాజీ టాకీస్ సమీప సాయిశివ ఫర్టిలైజర్స్ ఎదుట చేపట్టిన విస్తరణ పనులతో మురుగు పారుదల నిలిచి పోయింది. మురుగు దుర్గంధంతో ఇబ్బందిపడుతున్నామని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన అధికారులు మురుగు పారేందుకు కాల్వ తీయించారు.

◆ విద్యుదాఘాతంతో ఆవు మృతి

కొమురవెల్లి(సిద్దిపేట): విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని రాంసాగర్ గ్రామంలో జరిగింది. సోమవారం గ్రామానికి చెందిన తాడూరి రాజయ్య రోజు మాదిరిగా ఆవులను మేపేందుకు బావి దగ్గరకు తీసుకువెళ్లాడు. ప్రమాదవశాత్తు ఓ ఆవు ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఆవు విలువ రూ.90 వేలు ఉంటుందని, రైతును ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990